క్లుప్తంగా

చౌడేశ్వరికి ప్రత్యేక పూజలు


చౌడేశ్వరీదేవి

సదుం: మండలంలోని జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని మహిళలు 108 కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పాలాభిషేకం చేసి, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని దర్శించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డి కోసం అజ్మీర్ దర్గాలో ప్రార్థనలు


అజ్మీర్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఇర్ఫాన్ తదితరులు

పుంగనూరు: కూటమి ప్రభుత్వం నుంచి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని కాపాడాలని కోరుతూ ముస్లింలు గురువారం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్ ఆధ్వర్యంలో అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాకు చాదర్ సమర్పించి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ నుంచి బయటపడాలని, వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి రావాలని కోరారు. అనంతరం దర్గాలో పేదలకు అన్నదానం చేశారు.

బోన్ క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లి: బోన్ క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్న విద్యార్థి షాహిద్‌కు గురువారం చౌడేపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించారు. షాహిద్ దీన గాథపై ఇటీవల సాక్షి దినపత్రికలో 'నా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి' అన్న శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన హెచ్ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు రూ.26 వేలు సమకూర్చి విద్యార్థి తల్లిదండ్రులు షాజహాన్, నౌహీరాకు అందజేశారు. కష్టకాలంలో తమను ఆదుకున్న ఉపాధ్యాయులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

దాతల ఔదార్యం వెలకట్టలేనిది

తవణంపల్లి: సర్కారు బడుల్లో చదువుకొంటున్న పేదల పిల్లలకు దాతలు ముందుకు వచ్చి ఉచితంగా విద్యాసామగ్రిని అందజేయడం ప్రశంసనీయమని అన్నారు. బుధవారం మండలంలోని పొన్నేడుపల్లెకు చెందిన యాగమూర్తి యాదవ్ కుమారుడు దివంగత రాజేష్‌కుమార్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా తవణంపల్లె క్లస్టర్ హెచ్ఎం వేణుగోపాల్ రెడ్డి,బంధువుల చేతుల మీదుగా 160 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. దిగువమోదలపల్లె పంచాయతీలోని పొన్నేడుపల్లె, దిగువ మోదలపల్లె ఆదర్శ పాఠశాలలతోపాటు జి.వడ్డిపల్లె, చిగరాకులపల్లె ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, ప్రసాద్, రవిరెడ్డి, హేమావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తప్పని యూరియా కొరత


కర్ణాటక రాష్ట్రం సంగలిలో యూరియా అమ్మకాలు లేక బోసిపోయిన దుకాణం


పలమనేరులోని గ్రోమార్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

చిత్తూరు జిల్లాలో యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీకావు. సంబంధిత గ్రామోర్ సెంటర్లకు మాత్రమే యూరియా సరఫరా అవుతుండడంతో రైతులు బారులుతీరుతున్నారు. డిమాండ్‌కు తగినంత మేరకు యూరియా సరఫరా కాకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో యూరియా కావాల్సినంత వుంది. ఎమ్మార్పీకే ఎంత కావాలంటే అంత ఇస్తున్నారు. దీంతో రైతులు అక్కడి నుంచి యూరియా తెచ్చుకుంటున్నారు.

- షాపుల వద్ద బారులు తీరుతున్న రైతులు
- నామమాత్రపు చర్యలు తీసుకుంటున్న అధికారులు
- కర్ణాటక నుంచి తెచ్చుకుంటున్న రైతులు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో ఇటీవల వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. వేరుశనగ పంటకు అదును తప్పడంతో వరి పంట సాగుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం వరినాట్ల పనుల్లో బిజీగా మారారు. ఈ నేపథ్యంలో యూరియా అవసరం ఎక్కువైంది. దీన్ని అదునుగా భావించిన ఎరువుల వ్యాపారులు కృత్రిమ డిమాండ్ సృష్టించారు. కాంప్లెక్స్ ఎరువు కొంటేనే యూరియా ఇస్తామంటూ మెలిక పెడుతుండడంతో రైతులు విధిలేక కాంప్లెక్స్‌ను కొనాల్సిన పరిస్థితి నెలకొంది. యూరియా బస్తా ఎమ్మార్పీ రూ.250 వుండగా రూ.295లకు విక్రయిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే రేణిగుంట నుంచి ఇక్కడికి రావడానికి రవాణా చార్జీల కింద బస్తాకు రూ.37, అన్ లోడింగ్‌కు రూ.5లు చొప్పున బస్తాకు రూ.292 పడుతుందని, తాము రూ.295లకు అమ్ముతున్నట్టు రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు.

కృత్రిమ డిమాండ్

డిమాండ్ నెలకొనడంతో ప్రధాన డీలర్లు సైతం రిటైల్ డీలర్లు, వ్యాపారులకు యూరియా ఇవ్వకుండా స్టాకు పెట్టుకుని కృత్రిమ డిమాండ్‌ను సృష్టిస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి తోడు స్పిక్, నాగార్జున కంపెనీలు యూరియాను విక్రయించడం లేదు. దీంతో ఇతర కంపెనీల యూరియా ఇక్కడ సరఫరా అవుతుండడమూ డిమాండ్ పెరగడానికి కారణం అవుతోంది.

కర్ణాటకలో ఎంత కావాలంటే అంత రెడీ

ఈ ప్రాంత రైతులు ఇక్కడి యూరియాను అధిక ధరలతో కొనుక్కోలేకపోతున్నారు. ఒకవేళ కొందామన్నా యూరియా కొంటే కాంప్లెక్స్ కొనాలన్న మెలిక కారణంగా పక్కనే ఉన్న కర్ణాటకలోని నంగళి, ముళబాగిళు, బేతమంగళలలో యూరియా కొంటున్నారు. అక్కడి దుకాణాల్లో భారీగా యూరియా నిల్వలున్నాయి. ఎమ్మార్పీకే కావాల్సినంత యూరియా ఇస్తున్నారు.

ఘనంగా అమావాస్య పూజలు

చౌడేపల్లె: పుణ్య క్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ముందుగా ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆషాఢ మాసం ముగియడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోర్కెలు తీరిన భక్తులు మొక్కులు చెల్లించారు. వారికి ఈవో ఏకాంబరం పర్యవేక్షణలో అధికారులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ


పుంగనూరు: విరూపాక్షి మారెమ్మ

విరూపాక్షి మారెమ్మకు అమావాస్య పూజలు

పుంగనూరు: పట్టణంలోని బస్టాండులో వెలసిన విరూపాక్షి మారెమ్మ ఆలయంలో గురువారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి చలిపిండి దీపాలు వెలిగించి, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, మిరపకాయలు, చల్లముద్ద పెట్టి మొక్కులు చెల్లించారు.

అయ్యంకి రమణయ్యకు ఘన నివాళి

రొంపిచెర్ల: గ్రంథాలయ పితామహుడు, సామాజిక సేవకుడు అయ్యంకి రమణయ్య జయంతి ఉత్సవాలను గురువారం రొంపిచెర్ల గ్రంథాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక వేత్త డాక్టర్ రఘునాథ మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో జన్మించిన అయ్యంకి రమణయ్య చదువుకునే రోజుల్లోనే గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించారని తెలిపారు. ఇందులో భాగంగానే కోస్తాంధ్ర ప్రాంతంలో అనేక గ్రంథాలయాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.


నివాళులర్పిస్తున్న వక్తలు

కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రాజు, ధర్మాచారి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కీలపట్ల కొలింపాళ్యం వీధిలో కరెంటు సమస్య

- వారం రోజులుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

గంగవరం : మండలంలోని కీలపట్ల కొలింపాళ్యం వీధిలో వారం రోజులుగా కరెంటు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీధి చివర విద్యుత్ తీగలు తెగిపోయి వేలాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్తే ఏఈకి చెప్పండి రెడీ చేస్తారంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వాపోతున్నారు. వారం రోజులుగా వీధిలో కరెంటు లేక రాత్రిళ్లు అంధకారంలో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


విద్యుత్ స్తంభం వద్ద చిందరవందరగా ఉన్న వైర్లు

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు


మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్ఓ సుధారాణి

చిత్తూరు రూరల్(కాణిపాకం): సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఈ కారణంగా సీజనల్ ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. డెంగీ, చికెన్‌గున్యా, డయేరియా తదితర వ్యాధుల వ్యాప్తిపై శ్రద్ధ వహించాలన్నారు. పల్లెల్లో పర్యటిస్తూ.. సీజనల్ వ్యాధుల కట్టడికి సమష్టిగా పనిచేయాలన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డును విధిగా నిర్వర్తించాలన్నారు. టీబీ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ హనుమంతరావు, వైద్యులు సుదర్శన్, ప్రవీణ, అనూష, జార్జి, వేణుగోపాల్, జయరాముడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం వద్ద నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా యూనియన్ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం ఏఐపీఈయూ పోస్‌మ్యాన్, ఎంటీఎస్ యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పోస్టాఫీసుల నుంచి డెలివరీ వర్క్‌ను వేరుచేసి ఏర్పాటు చేస్తున్న ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్(ఐడీసీ)లో మార్పులు చేయాలని కోరామన్నారు. ఇందులో ఎటువంటి మార్పులు చేయకపోవడంతో నిరసన చేస్తున్నామన్నారు. వీరికి ఏఐపీఈయూ, జీఆర్‌సీ, ఏఐజీడీఎస్‌యూ యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, మూర్తి, రామమూర్తిశెట్టి, చిన్నబ్బ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పశుసేవలకు ప్రాధాన్యం ఇవ్వాలి

గుడిపాల: పాడి పశువులకు సంబంధించి సేవలు అందించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ అన్నారు. గురువారం గుడిపాల పశువైద్య కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్‌లు, గోపాలమిత్రలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 27 పంచాయతీల్లోని పశువులను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ముద్ద చర్మ వ్యాధికి సంబంధించి పశువులు ఉన్నట్లయితే వాటికి సంబంధించి చికిత్సలు చేయాలని సూచించారు. డ్వాక్రా మహిళలకు సంబంధించి ప్రతి గ్రామంలో సర్వే చేసి వారికి ఏమైనా పశువులు కావాలా, వద్దా అని అడిగి తెలుసుకోవాలన్నారు. వారికి పశువులు కావాలంటే వాటికి సంబంధించి బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేసి వారిని అభివృద్ధి చేసేలా ముందుకు సాగాలన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్లు

మామిడిని ర్యాంపులకు తరలిస్తేనే సబ్సిడీ

గంగవరం: మామిడి కాయలను పలమనేరు, బంగారుపాళ్యం ర్యాంపులకు తరలిస్తేనే ప్రభుత్వ సబ్సిడీని రైతులు పొందే అవకాశం ఉంటుందని ఉద్యానశాఖాధికారి వరప్రసాద్ తెలిపారు. అదే విధంగా మామిడికి ప్రభుత్వ మద్దతు ధర కోసం ఈ వారం లోపు మామిడి కాయలను పూర్తిగా కోసి జ్యూస్ ఫ్యాక్టరీ లేదా మండీలు, ర్యాంపులకు తరలించాలన్నారు. ఇప్పటికే అన్ని రకాల మామిడి కాయలను ర్యాంపులు, ఫ్యాక్టరీలు, మండీలకు తరలించిన రైతులు ప్రభుత్వ సబ్సిడీకి నమోదు చేసుకున్నారు. ఆఖరున బెంగళూరు రకం మామిడి కాయలు ఈ వారంలోపు కోసి రిజిస్టర్ చేసుకున్న మండీలు లేదా ర్యాంపులు, ఫ్యాక్టరీలకు తరలించి ప్రభుత్వ సబ్సిడీకి వెంటనే నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎట్టి పరిస్థితిలోనూ ఆలస్యం చేయవద్దని లేకపోతే సబ్సిడీ రాదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అర్హులందరికీ దీపం గ్యాస్ కనెక్షన్

శాంతిపురం: మండలంలోని అర్హులందరికీ దీపం వంట గ్యాస్ కనెక్షన్ ఇస్తామని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం రాళ్లబూదుగూరులో దీపం కనెక్షన్ల పంపిణీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వంద శాతం కుటుంబాలకు వంట గ్యాస్ ఉండేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కనెక్షన్ లేని వారు దీపం పథకం కింద లబ్ధి పొందేందుకు స్థానిక పంచాయతీ కార్యదర్శి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇప్పటి వరకూ గుర్తించిన 162 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు కనెక్షన్ల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకరయ్య, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టోర్స్‌ను పరిశీలించిన ఎస్ఈ


అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతి ఎస్ఈ సురేంద్రనాయుడు గురువారం ట్రాన్స్‌కో స్టోర్స్‌ను పరిశీలించారు. కార్యాలయ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న డీఈ కార్యాలయాల భవనాన్ని పరిశీలించారు. స్టోర్స్‌లో ఉన్న పరికరాల వివరాలు తెలుసుకున్నారు. నూతనంగా వేయనున్న రోడ్డు పనుల గురించి మాట్లాడారు. సకాలంలో వ్యవసాయ పరికరాలు అందించాలన్నారు. అనంతరం హమాలీలు వారి సమస్యల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ జగదీష్, డీఈ వసంతనాయుడు, ఏఈలు మోహన్‌రావ్, జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ


గుడిపాల: రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న లక్ష్మీప్రసన్న

గుడిపాల: జీవన ఎరువుల వాడకంపై ప్రతి రైతూ అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం అధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం వసంతాపురం రైతు సేవా కేంద్రంలో జీవన ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని మోతాదు మించి వాడితే అనర్థకమని, సాగు ఖర్చులు అధికమవుతాయని సూచించారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువుల వాడకంతో ఖర్చులు తగ్గి, నేల సారం పెరుగుతుందన్నారు. రైతులు జీవన ఎరువులు, పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. అనంతరం రైతులకు ఇంటి పరిసరాల్లో కాయగూరల సాగుకు సంబంధించి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది సోనియా, దీపక్, శ్రీకాంత్, దేవేంద్రలు పాల్గొన్నారు.

ఇదో నిజాయితీ పెట్టె కథ!

పిల్లలకు మనం చిన్నప్పుడు ఏది మంచిదని చెబితే దాన్నే పాటిస్తారు. విలువలు నేర్పితే మంచి పౌరులుగా ఎదిగి నవ సమాజ స్థాపనకు కృషి చేస్తారు. అందుకే మొక్కై వంగనిది మానై వంగునా అని పెద్ద సామెత చెబుతూ వుంటారు. ఈ క్రమంలోనే పిల్లల్లో నిజాయితీని పెంపొందించేందుకు ఒక ఉపాధ్యాయుడు చేసిన చిన్న ప్రయత్నం మంచి ఫలితాలను ఇస్తోంది. పాఠశాలలో ఏర్పాటుచేసిన నిజాయితీ పెట్టె ద్వారా పిల్లలు నిజాయితీగా, నైతిక విలువలతో మసలుకుంటున్నారు. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ఇందులో పిల్లలకు కావాల్సిన వస్తువులు
- అవసరమైన వారు నిర్ణయించిన ధరతో కొనాలి
- చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో నిజాయితీ



నిజాయితీ పెట్టెలో వస్తువులను తీసుకుంటున్న పిల్లలు



పెట్టెలోని వస్తువుల ధరల పట్టిక

పలమనేరు: పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం కీలపట్ల బడిలో ఓ నిజాయితీ పెట్టె ఉంది. ఇందులో పిల్లలకు అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, రేజర్లు, చాక్లెట్లు, నోట్సుబుక్స్ ఉంటాయి. అవసరమైన పిల్లలు తమకు కావాల్సిన వస్తువులను తీసుకుని దానిపై నిర్ణయించిన ధర చెల్లించాలి.

నిజాయితీతోపాటు లెక్కలు వస్తాయి

ఈ పెట్టె కారణంగా చిన్నప్పటి నుంచే పిల్లలు విలువలతోపాటు లెక్కలు నేర్చుకునేందుకు వీలు ఏర్పడింది. బడిలో చోరీ చేయాల్సిన పని లేకుండా పోయింది. వారు కొనుక్కున్న వస్తువులకు ఎంత డబ్బు చెల్లించాలి, ఇచ్చిన డబ్బులో ఎంత మిగిలింది అనే విషయం వారు అనుభవంతో తెలుసుకుంటారు. తద్వారా నిజ జీవితంలోనూ అవసరమై లెక్కలు నేర్చుకుంటున్నారు. పెట్టెలోని వస్తువులను డబ్బు లేకున్నా పొంది ఆపై ఉన్నప్పుడు డబ్బు కట్టవచ్చు. దీంతో లావాదేవీలు నీతిగా ఉండాలనే తలంపు చిన్నప్పటి నుంచే పిల్లలకు అలవడుతోంది.

టీచర్ వినూత్న ఆలోచనతో సాకారం

ఇదే బడికి చెందిన తులసీనాథం నాయుడు అనే టీచర్ రూ.2 వేలు పెట్టి పిల్లలకు అవసరమైన వస్తువులను ఈ పెట్టెలో పెట్టారు. ఆపై ఇందులోని అవసరమైన వస్తువులను పిల్లలు కొనడం మొదలు పెట్టారు. ఇలా నెలంతా వసూలైన మొత్తంతో ఆ టీచర్ మళ్లీ వస్తువులను బాక్సులో నింపడం చేస్తున్నారు.

పరాయి సొమ్ము పాముపంటిదని తెలిసింది



మా స్కూల్‌లో నిజాయితీ పెట్టె ఉంది. మాకు అవసరమైన వస్తువులను తీసుకుని నిర్ణయించిన ధర మేరకు డబ్బును సార్‌కు ఇస్తున్నాం. దీంతో బడిలో ఎలాంటి చోరీలు లేకుండాపోయాయి. మాకు లెక్కలు బాగా అర్థమవుతున్నాయి. పరుల సొమ్ము పాము వంటిందని బాగా తెలిసింది. డబ్బులు లేకున్నా కావాల్సిన వస్తువులను పెట్టెలో తీసుకుని ఆపై డబ్బును ఇవ్వడం కూడా నిజాయితీనే కదా అనే విషయం అర్థమైంది.

– భానుప్రియ, నాలుగో తరగతి విద్యార్థిని

మొక్కై వంగనిది మానై వంగునా..



చిన్నప్పటి నుంచి పిల్లలకు మానవ విలువలు, నీతి, నిజాయితీ గురించి చెబితే పెద్దయ్యాక కూడా అలాగే నడుస్తారు. నేను తొలుత ఇదే మండలంలోని కంచిరెడ్డిపల్లి బడిలో నిజాయితీ పెట్టెను ఏర్పాటు చేశాను. పిల్లల్లో చాలా మార్పు వచ్చింది. దీంతో నేను ఏ బడికి వెళ్లినా అక్కడ నిజాయితీ పెట్టెను పెడుతున్నా. తద్వారా పిల్లల్లో నిజాయితీ, మంచితనం అలవాటుగా మారింది. పెద్దలు చెప్పినట్టు మొక్కై వంగనిది మానై వంగుతుందా..

– తులసీనాథం నాయుడు, టీచర్

భక్తులకు అన్నదానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కోర్కెలు తీరిన వారు మొక్కులు తీర్చుకున్నారు. దాత పార్థసారథినాయుడు భక్తులకు అన్నదానం చేశారు.